


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### *బిగ్‌బాస్*

**జీవితం ఒక ఆట.** ఆడడం తప్ప, తప్పించుకోవడం మన చేతిలో లేదు. అసలు స్టార్ మా లో వచ్చే తెలుగు బిగ్‌బాస్ అయినా, వేరే దేశంలోని బిగ్‌బ్రదర్ అయినా ఒకే ఫార్ములా మీద డిజైన్ చేసారు.

ఈ రోజుల్లో బిగ్‌బాస్ హౌస్‌లో 80 కెమేరాలున్నట్లే, మీ జీవితానికి లక్షలాది కెమేరాలున్నాయి. ఎలాగంటారా? మీరు రోడ్డు మీద నడుస్తున్నారు. మిమ్మల్ని ఒక కన్ను గమనిస్తోంది. అది కెమేరా కన్ను.

ఒక హాస్పిటల్‌లో కెళ్ళి డాక్టర్ గారితో మాట్లాడుతున్నావు.. అక్కడ టేబుల్ మీదున్న పెన్ తీసి ఎవరూ చూడటం లేదనుకుని, జేబులో వేసుకున్నావు. బయట ద్వారం దగ్గరున్న రిసెప్షనిస్ట్ చిరునవ్వుతో "సార్.. డాక్టర్ గారి పెన్ మీ జేబులో వేసుకున్నారు. ఇచ్చి వెళ్ళండి సార్. మీ బిల్‌లో పెనాల్టీ కూడా వేసాం. పే చేసెయ్యండి. నమస్కార్. హేవ్ ఎ గుడ్ డే సర్" అంటుంది.

ఎందుకంటే సీ.సీ కెమెరాలో చూసింది కాబట్టి, సరే మీరు కనకారావ్ ఇంటికి వెళ్ళారు. వెళ్తూ వెళ్తూ తుపుక్కున చెట్లలో ఉమ్మి లోపలకి నడిచారు. కాసేపట్లో పని మనిషి ఒకమాప్, బకెట్‌తో నీళ్ళూ తెచ్చి, "నువ్వు ఉమ్మిన చోట శుభ్రం చేసిరా పెద్దమనిషీ" అంటే, ఆ ఇంటికి సీ.సీ కెమేరాలున్నాయని తెలీని మీరు ఆమెకి దివ్యదృష్టి వుందేమో, యోగ సంపన్నురాలేమో అని కాళ్ళ మీద పడిపోయే ఛాన్స్ వుంది.

రోజా పూల దొంగలు తెల్లవారుఝామునే కోసేస్తుంటే, ఎదురింటివాళ్ళ సీ.సీ కెమేరాని శరణుజొచ్చి, అరవై ఏళ్ళ రిటైర్డ్ హెడ్ మాస్టార్ గారిని పట్టుకున్నాను. అదీ కెమేరా స్వామి మహిమ.

ఇంక బిగ్ బాస్ కంటెస్టెంట్స్ ఆట అంటే, మిగతా హౌస్‌మేట్స్‌లో తప్పులు పట్టి, ఈ ఇంట్లో వుండడానికి వాళ్ళు అర్హులు కారని, ఎలిమినేషన్‌కి నామినేట్ చెయ్యడం. ఇది ఏ ఆఫీసులో జరగదు చెప్పండి?

"సార్. ఇరవై సంవత్సరాల నా సర్వీస్‌లో ఎంత నిజాయితీగా, ఎవరిమీదా పడి ఏడవకుండా, నిస్వార్థంగా వుంటానో తెలుసా? ఆ కనకారావు ఒట్టి కుళ్ళు వెధవ. వాడికి ఇంటి దగ్గర వడ్డీ వ్యాపారం కూడా వుంది. మీ బట్టతలమీద జోకులు

కూడా వేస్తాడు. వాడికి ఇంక్రిమెంట్ ఇవ్వకండి సార్. నాకు ప్రమోషన్ ఇవ్వండి" అన్నవాడే కనకారావు ఇంటికి ఆదివారం వెళ్ళి, వాళ్ళ ఆవిడ చేసే ఆకు పకోడీ బావుందని, తెగ మెచ్చుకుని లొట్టలేస్తూ తింటాడు.

ఇంక గేమ్స్ "నిగ్రహానికి పరీక్ష, ఓ చోట కదలకుండా కూర్చోడం, బాత్ రూంకి కూడా లేవకపోవడం, చివరి వాడే విజేత. ఈ సందర్భం ఎన్నో సాహిత్య కార్యక్రమాల్లో కవి సమ్మేళనాల్లో ఆఖరి వక్తకి జరిగేదే, అర్జెంట్‌గా వాష్‌రూంకి వెళ్ళాల్సిన పరిస్థితిలో లేస్తుంటే, ఆర్గనైజర్స్ "తరువాత మీరేనండీ.. ఒక్క నిమిషం.." అని కూర్చో పెట్టేస్తుంటారు. మైకాశురులు విజృంభించి మైక్‌ని పరపరా ఆకలేసినట్లు నమిలి మింగేస్తూ, ఆపకుండా మాట్లాడేస్తుంటారు. ఇక్కడ పొట్టలు రాయిల్లా మారిపోతుంటాయి. "రామజన్మభూమిలో బ్రాబీ మసీదు ఎలా కట్టారు.. పాక్ ఇండియా మేచ్‌లు అయినప్పుడు జాతీయ శెలవు దినాలు చెయ్యాలి... ప్రసాదాలకి పులిహోరలో మిరియాలు మానేసి మిరపకాయలే వెయ్యాలి - లిరిల్ ఎడ్వర్టైజ్‌మెంట్ ఏడ్‌లో అమ్మాయి వలన ఆ సబ్బుకొని వాడితే, నాకువున్న నిగారింపు పోయింది. కేసు లిరిల్ కంపెనీ మీద వెయ్యాలా? మమ్మల్ని ఎట్రాక్ట్ చేసిన అమ్మాయి మీద వెయ్యాలా?" ఇలా ఒక విషయం నుండి ఇంకో విషయానికి జంప్ చేస్తూ, మైకాసురుల ప్రసంగం సాగుతూ వుంటుంది. మా అన్నయ్య ఫ్రెండ్ ఒకడు హాస్టల్‌లో వున్న కామన్ బాత్‌రూంలో కూర్చుని "కాలమిలా సాగిపోతే.." అని పాడేవాడుట.

"ఇక్కడ మా కడుపులు ఉబ్బిపోయివున్నాయిరా.. నీ కాలమిలా సాగిపోతుంటే" అని బయటవాళ్ళు అరిచేవారట. సో ఎన్నో టాస్క్‌లు తెల్లారి లేస్తే, కర్ర విరగకుండా పాము చావకుండా, ఇంటికొచ్చిన అతిథుల్ని వెళ్ళగొట్టడానికి, రకరకాల స్కిట్లు. అత్తగారు వంట గదిలో తుమ్మగానే "ఆవిడకి మూడు రోజులుగా గొంతు నెప్పి, జలుబూ, జ్వరం. కరోనా ఏమో అని డౌటుగా వుంది. ఇంకా టెస్ట్ చేయించలేదు. అయినా మీరొచ్చారని ఆవిడే కాఫీ పెడ్తానని పట్టు పట్టారు. ఉండండి తీసుకొస్తాను. నాకు ఒళ్ళంతా ఒకే నెప్పులుగా వుంది. కూర్చోండి. వంటకూడా మా అత్తగారే చేస్తున్నారు" అంటే వచ్చినవాళ్ళు, గుండెల్లో రైళ్ళు పరిగెత్తి, లేచి "వెళ్ళొస్తామండీ" అనక ఏం అనగలరూ?

అలాగే నామినేషన్ రోజుకోసం బిగ్‌బాస్ కంటెస్టెంట్స్, తుప్పాస్ రీజన్స్ అన్నీ వెతుక్కుని పెట్టుకుంటారు.

"నేను అటుగా వెళ్తుంటే నువ్వు ముక్కు చీది, చెయ్యి విదిలించావు. నాకు నచ్చలేదు. నేను తీసుకోలేకపోయాను. అందుకే నామినేట్ చేస్తున్నాను" అంటుంది.

"నువ్వు నేను తుమ్మేదాకా ఆగి, అటుగా వెళ్ళావు రీజన్ లేక. కానీ నీమీద నాకు రీజన్ వుంది, నేను హెయిర్ లూజ్‌గా వదిలేస్తే బావుంటుంది అన్నావు మొన్న."

"అంటే? కాంప్లిమెంటేగా?"

"అంటే, హెయిర్ జడ అల్లుకుంటే బాలేను అనేగా? అందుకే నాకు నచ్చలేదు. నీలో మంచి వైబ్ లేదు. నువ్వు హౌస్‌లో వుండకపోతే నాకు ఇష్టం."

ఇలావుంటాయి బిగ్‌బాస్‌లో నామినేట్ చేసే రీజన్స్.

నిజజీవితాల్లో మాత్రం తక్కువా? కామాక్షి అంటుంది కోడలితో "మీ అన్నయ్య నిన్న వచ్చాడా? అమ్మ బావుందా? అన్నానా మాట్లాడలేదు, సీతారామం చూసావా అన్నానా దానికీ మాట్లాడలేదు. కాఫీ ఇస్తే మాత్రం గట గటా తాగేసాడు" అని.

దానికి కోడలు "అన్నయ్య చెవిలో ఇయర్ పాడ్స్ పెట్టుకుని క్రికెట్ మేచ్ వింటున్నాడండీ. అందుకే వినబడి ఉండదు" అని కోడలు చెప్పినా, ఆవిడ కన్విన్స్ అవలేదు.

"ఇంకెప్పుడూ అతనొస్తే నేనుకాని, నువ్వు కానీ కాఫీ ఇవ్వొద్దు, నేను అఫెండ్ అయ్యాను" అంటుంది.

ఇక మన ఖర్మకి ఒక లుంగీనో, లంగానో కొంటాం. వాడు "మీ మొబైల్ నెంబర్ మేడం?" అంటాడు.

మొబైల్ నెంబర్ ఇస్తాం. అంతే మన ఆధార్ నెంబర్, బ్యాంక్ పాస్‌బుక్ నెంబర్, మనకి కోవిడ్ వచ్చి తగ్గిందో లేదో, వాక్సిన్ వేసుకున్నామో లేదో ఎంత మంది పిల్లలో, ఎంత జీతమో, మనది హైక్లాసో, మిడిల్ క్లాసో, లోయర్ మిడిల్ క్లాసో అన్నీ గూగుల్ చెప్తుంది వాడికి. జాతకాలు చెప్పే వేణు స్వాములతో పనిలేదు. మన మొబైల్ నెంబర్ తెలిస్తే చాలు.

ఇంక ఫోన్ టేబుల్ మీదుండగా, "ఈ కార్ తెగ ట్రబులిస్తోంది, అమ్మి పారేసి వేరేది కొనాలి" అన్నారే అనుకోండీ, ఫోన్ తెరవగానే రకరకాల కారు ఆప్షన్స్ వస్తూ వుంటాయి. అదే సిద్ శ్రీరాం ముక్కుతో పాడే పాటలు ఇష్టం అంటే, యూ ట్యూబ్ అన్నీ అతని పాటలే చూపిస్తుంది.

ఓసారి నేను ఫోన్‌లో చూస్తూ "శ్రీనిస కళ్యాణ మంటపం.. ఇక్కడే ఎక్కడో అడ్రెస్ పెట్టండి ఫోన్‌లో" అని మావారికి చెప్తుంటే ఫోన్ గణాగణా మోగింది. తీస్తే "శ్రీనివాసా కళ్యాణ మండపం మేనేజర్‌ని మాట్లాడుతున్నాను. మీ ఫోన్ నుండీ కాల్ వచ్చింది" అంటున్నాడు. కట్టుకున్న మొగుడు ఇట్లా మాట వింటే ఎంత బావుండేదో. ఈ ఫోన్‌లో 'సిరి' ఏప్ మాత్రం చెవులు దోరబెట్టుకుని, మన ప్రతి మాటా, వెనక సీట్లో లేడీస్ మాటలకోసం, కాచుకు కూర్చునే డ్రైవర్‌లా వినేసి, ఏక్షన్ తీసేసుకుంటుంది.

ఇంక ఏ పిజ్జానో ఆర్డర్ చేస్తే "మీకు డయాబిటీస్ వుందిగా చీజ్ వెయ్యం" అని చెప్తుంటే, అడ్డం పడి "ఇవన్నీ మీకెవరు చెప్పారు?" అంటే, "మీ ఆధార్, మెడికల్ బిల్స్ అన్నీ మీ ఫోన్‌కి కనెక్ట్ అయివున్నాయండీ" అంటుంది.

"ఇవన్నీ చూడడం నేరం.. మీ మీద కేసు పెడ్తా" అంటే,

"ఆల్ రెడీ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మీరోసారి పట్టుబడ్డారుట. మీకు మేం అమ్మం. మీరు ఈ పిజ్జా మందు తాగుతూ తినడం కోసం తెప్పిస్తున్నారేమో తింటూ, డ్రింక్ చేసి డ్రైవ్ చేస్తారేమో" అన్నా అనచ్చు.

ఇలా మన బతుకులు బజార్లో, ఇన్ని లక్షల కెమేరాల మధ్య మరుగు అనేది లేకుండా వుంటే బిగ్‌బాస్‌కీ నిజ జీవితాలకీ తేడా ఎక్కడ?

ప్రీ వెడ్డింగ్ ఫోటో షూట్స్ పేరుతో రోడ్డుమీద రొమేన్స్‌లూ, డెయిలీ లైఫ్ వ్లాగ్స్ పేరుతో, ఇంట్లో ఏం వండుతున్నారో, మొగుడ్ని ఎలా తిడ్తున్నారో, ఏమేం కొన్నారో అన్నీ. యూ ట్యూబ్‌లో మీకు ఏం ఇష్టమో? ఏ రంగు చీర కట్టుకున్నారో, ఏం వంట చేసారో, నగలు అల్మారాలో ఏ అరలో పెట్టారో అన్నీ సోషల్ మీడియాలో, ఎవరినైనా తిట్టాలంటే ట్విట్టర్, పొగడాలంటే ఎఫ్ బీ, రొమేన్స్‌కి మెసెంజర్, విడాకులకి వాట్సాప్, టిక్‌టాక్‌లంటూ సిగ్గూ శరం కాస్తా వదిలేసి, మీ పెళ్ళాం, బిడ్డలతో ఐటెమ్ డాన్స్‌లు, అన్నీ వీధిలోనూ, వెబ్‌లోనే.. అసలు ఈ వెబ్ అనే మాట అంటే సాలెగూడు. ఓసారి ఈ ప్రలోభాల్లో, వ్యసనాల్లో చిక్కుకుంటే బయటకి రాలేరు.

ఇంక ఆ పైవాడు బిగ్‌బాస్ కన్నా తక్కువవాడా? అతని పని ఎలిమినేట్ చెయ్యడం, సమయం చూసి మీ అలవాట్లకీ, అత్యాసకీ మీ అంతట మీరే బలైపోయేట్లు చేసి "యు ఆర్ ఎలిమినేటెడ్' అంటాడు. అదండీ.. ప్రతి మనిషీ కెమేరాల ముందు బిగ్‌బాసే ఆడ్తున్నాడు ఈ కాలంలో.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4